# మేడమ్ గారి మ్యారేజ్‌డే

చిట్టిపొట్టి చదివే స్కూలు యజమానురాలి పేరు సీతాంరత్నం.,

ఆవిడ సీతలాగా మహాసాధ్వి కాదు రత్నంలాగా అపురూపమైన అందగత్తె కాదు. ముసలి ఎద్దుకి గంగిరెద్దు అలంకారం చేసినట్లుంటుంది.

సీతారత్నం మొగుడు పానకాల్రావు. పానకంలాంటి ఆవిడబ్రతుకులో పుడకలా అడ్డొస్తుంటాడు. మనిషి గూడా ఎండిపోయిన యజ్ఞ సమిధలాగా వుంటాడు.

సీతారత్నం ఏడాదికోరోజున సీతమ్మ వారిలా భర్త సేవ చేసుకుంటుంది. కాకపోతే ఆరోజు అతడేం చెయ్యాలో, ఏం చెప్పాలో అంతకు క్రితం రోజునే ప్రాంప్టింగిస్తుంది. ఇంతకీ ఆ పర్వదినం పేరు – వాళ్ళ మ్యారేజీ డే!

మరి మ్యారేజీడే భారీ ఎత్తున జరపాలంటే సొమ్ములు కావాలి. పానకాల్రావు పాద పూజలు చేస్తే చేయించకుంటాడుగానీ పైస లంటే పళ్ళికిలిస్తాడు. సీతారత్నం దగ్గిరున్నా బయటపెట్టదు – మరెలా ?

డబ్బు కోసమా మీచింత – ? స్కూలు వున్నదిగా మనచెంత !

సీతారత్నం మిగతా టీచర్లందరికీ ఆర్డర్సు వేసేస్తుది. కాస్త ముందుగానే .ఇహ టీచర్లు క్లాసులో పిల్లల్ని పీక్కుతింటారు పరోక్షంగా

" పిల్లలూ – రేపు ఆరోతారీఖు మనమంతా కలిసి ఆంజనేయపురం వెళ్ళి అక్కడున్న అరటిచెట్లని చూసిరావాలి. ఇది ఎడ్యుకేషనల్ టూర్ – వెళ్ళొచ్చాక అందరూ అరటిచెట్టుపైన వ్యాసం రాయాలి. కాబట్టి మీ నాన్నలనడిగి వెంటనే ( టైం లేదు మరి ) తలో పదిరూపాయలూ పట్రండి. లేకపోతే మర్యాదగా వుండదు.

ప్రటకన వెలువడింది.

చిట్టిపొట్టి వాళ్ళ క్లాసులో గూడా ప్రకటన జరిగింది.

" ఏరా చిట్టి – అరటి చెట్టు చూట్టానికంత దూరం ఎందుకురా " అడిగాడుపొట్టి అర్థం కాక.

" ఏమో మరి – వ్యాసం రాస్తే ఆ అరటి చెట్టు పైనే వ్రాయాలి గాని, ఇంకోళ్ళ అరటిచెట్టుపై వ్రాయకూడదు – అవునూ ఇంతకీ నువ్విస్తావా "

" ఏమో – ఇంతవరకూ ఫీజ్ కట్లేదు – మా నాన్నేమంటాడో, మరి నువ్వూ ? "

" ఏమో అడిగి చూస్తా – ఇవ్వక పోతే టీచరు కొడుతుందంటావా "

" సుబ్బరంగా "

ఇద్దరూ ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తూనే ఇళ్ళకెళ్ళిపోయారు.

ఆ మర్నాడు తిరిగి స్కూలుకెడుతున్నా అదే ఆలోచన.

పద్మావతీ టీచరు ఆరోజే డబ్బులు తెమ్మంది.

" చిట్టి డబ్బులు తెచ్చావురా 'అనడిగాడు పొట్టి భయంగా.

" మా అమ్మ స్కూలుకొచ్చి మాట్లాడి కడతాలేనువ్వెళ్ళు అందిరా – అవును నువు తెచ్చావా "

" మా అమ్మ కేకలేసింది – లేవు పొమ్మంది " దిగులుగా అన్నాడు పొట్టి.

" అయితే టీచరడిగితే ఏం చెప్దాం ? "

" అరటిచెట్లు చూట్టానికి నేరావడం లేదని చెప్తా "

" అమ్మో కొడుతుందేమో రా "

" మరెలా ఇంకేం చెప్పను "

చిట్టి ఇంకేం మాట్లాడక మౌనంగా నడుస్తున్నాడు. పొట్టికి భయంగా వుంది.

ఇద్దరూ క్లాసులో కూర్చున్నారు. కాస్సేపటికి పద్మావతి టీచరు రానేవచ్చింది. హాజరు పట్టివేసింది. ఆ పైన పాఠం మొదలుపెట్టబోతూ సీతారత్నం హెచ్చరిక గుర్తుకొచ్చి " పిల్లలూ – టూర్‌కి పదిరూపాయలు తెమ్మని చెప్పాను తెచ్చారా "

" ఓ – తెచ్చాం టీచర్ " కోరస్‌గా అరిచారు బుద్ధిమంతులైన విద్యార్తులు.

పద్మావతి మొహం పద్మంలాగా వికసించింది.

" గుడ్ – అలా వుండాలి – తెచ్చిన వాళ్ళంతా ఇలా వచ్చి ఇచ్చుకోండి " అంది.

అమాయక పిల్లలు గుంపులు గుంపులుగా వెళ్ళి పోటీలు పడి డబ్బుని ఆమె బల్లపూన వుంచారు.

నోట్లు కొత్తవి ఒక మాదిరివి, పాతవి రకరకాలవి అనేకరకాల కష్టార్జితాలు రెక్కలొచ్చి అక్కడ వ్రాలాయ్.

పత్మావతి టీచరు ఆ నోట్లని సర్తుకుంటూ – " ఇంకా తేవని వాళ్ళు లేచి నిలబడండి " అంది మామూలు ధోరణిలో

పదిమంది పిల్లల్తోపాటు చిట్టి పొట్టి గూడా లేచి నిల్చున్నారు . పద్మావతి టీచరు అంతమందిని చూసేక కాస్త దిగులుపడింది. సీతారత్నంతో లెక్కంటే లెక్కే. క్లాసులో

ఎంతమంది పిల్లలున్నారో వాళ్ళని పదిచేతగుణించి లెక్క సిద్దం చేసి పెడుతుంది. అంతకన్నా తగ్గితే తిట్టి పోస్తుంది. పాఠాలు చెప్పలేరు. డబ్బులూ పిండలేరు. ఇంకెందుకు నా నెత్తినెక్కనా అంటుంది.

అంచేత పద్మావతి టీచరుకంగారుగా " ఎందుకు తేలేదు – ఆంజనేయపురం వచ్చి అరటిచెట్లు చూడ్రా ' అనడిగింది.

అందరూ తలోమాట చెప్పారు. చిట్టివంక చూసింది.

చిట్టి ధైర్యంగా " రావాలనే వుదండి – కాని మా నాన్నగారు తిట్టారండి "

" దేనికిట ? "

" మొన్న మీరు కాలము – పని లెక్కడిగితే చెప్పారు కదూ. ఆ లెక్క చేయించి పట్రా పదిరూపాయలిస్తాన్నారండి "

పద్మావతీ టీచరు అతడి వంక పరీక్షగా చూసింది. వీడి బాబెవడో గాని డేంజరు మనిషనుకుంటూ " సర్లే కూర్చో లెక్కకి ఆంజనేయ పురానికి ఏమిటి సంబంధం " అని గొణుక్కుంది.

మేడమ్ గాని మ్యారేజీడేకి ఆంజనేయపురం టూర్‌కి ఏవిటి సంబంధం అని పిల్లలు అడిగేరు కాదు.

పద్మావతి టీచరు మళ్ళీ చిట్టినిగాని పొట్టినిగాని పది రూపాయలు అడగలేదు.

**------- అయ్యిపోయింది -------**